పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని వారికి ఈ నెల 27న సిఎం జగన్ మంజూరు చేస్తారని చెప్పారు. అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న చేయూత, కాపునేస్తం, నేతన్ననేస్తం, వాహనమిత్ర, చేదోడు, ఇబిసి నేస్తం పథకాలకు సంబంధించి 2.51 లక్షల మందికి 403 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని చెప్పారు. 2,63,255 మందికి పింఛన్లు, 44,543 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు, 14 వేల మందికి రేషన్ కార్డులు, 14,500 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

బెస్ట్ ఉమెన్ ఆఫ్ ది ఎపిగా యశోద

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్, వీరఘట్టం

బంగారు పతకాన్ని అందుకుంటున్న యశోద

వీరఘట్టంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న యశోద బెస్ట్ ఉమెన్ ఆఫ్ ది ఎపిగా ఎంపికయ్యారు. ఈ నెల 16, 17 తేదీలలో నెల్లూరు జిల్లాలో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో ఆమె వరుసగా ఐదు బంగారు పతకాలు సాధించి, బెస్ట్ ఉమెన్ ఆఫ్ ది ఆంధ్ర ప్రదేశ్‌గా ఎంపికయ్యారు. 100 మీటర్లు 200 మీటర్లు 1500 మీటర్ల పరుగు పందేలు, 4×100, 4×400 రిలే పరుగులో బంగారు పతకాలను కైవశం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఐదు బంగారు పతకాలు సాధించిన గోల్డెన్ లేడీగా మారారు. యశోదకు డిఇఒ రమణ, జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వాసుదేవరావునాయుడు, జిల్లా స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ డిటి గాంధీ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, మురళి అభినందనలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు
- నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మట్టి తవ్వేసిన ప్రాంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో రాత్రి సమయాల్లో అక్రమంగా మట్టి తవ్వి ఎత్తుకు పోతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరిస్తోంది. మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా ఎక్కడ తీసుకోవడం లేదు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులలో అక్రమంగా మట్టి తవ్వి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణ సమీపంలో ఉన్న కోటి చెరువు, గ్రోత్ సెంటర్‌కు అనుసరించి ఉన్న స్వామివారి చెరువు, ఎం.బూర్జవలస, మెట్టవలస, పనుకువలస, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. ఈ తవ్వకాలతో చెరువులలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వర్షా కాలంలో వరదనీరు చేరి పశువులు, పశువుల కాపర్లు, పొలానికి నీరు కోసం చెరువులలో దిగే రైతులు ఆ గోతుల్లో దిగి మృత్యువాత పడుతున్నారు. గున్నతోటవలస చెరువులో ఏడాది క్రితం ఒక రైతు గోతిలో పడి మరణించాడు. ఎపిఐఐసి భూముల్లో రాత్రి సమయాల్లో మట్టి మాఫియా తవ్వకాలు చేస్తున్నారు. సాలూరు రైల్వే ట్రాక్ కు అనుసరించి ఉన్న ఆరు ఎకరాల ఎపిఐఐసి భూముల్లో వారం రోజులుగా రాత్రి సమయాల్లో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. పరిశ్రమల కోసం కేటాయించిన భూముల్లో మట్టిని తవ్వి గోతులు చేస్తే పరిశ్రమల ఏర్పాటుకు ఎవరు ముందుకు వస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. టిడ్కో ఇళ్లకు వెళ్లే దారిలో రామన్నదొరవలస గిరిజనుల భూముల్లో గ్రావెల్ ఉండడంతో రాత్రి సమయాల్లో యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు.

రాత్రి సమయాల్లో తవ్వేస్తున్నారు

ఎపిఐఐసి భూముల్లో రాత్రి సమయాల్లో మట్టిని తవ్వేస్తున్నారని ఎపిఐఐసి జెఇ రాజేష్ అన్నారు. తవ్వకాలను అడ్డుకునేందుకు రాత్రి సమయాల్లో నిఘా పెడితే తవ్వడం లేదని, తాము లేని సమయంలో మట్టిని తవ్వేస్తున్నారని తెలిపారు. తవ్వకాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

అంగన్వాడీల బదిలీలో అక్రమాలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ హెల్పర్ల ప్రమోషన్లలో అక్రమాలు జరిగాయని, అవకతవకలు నిరోధించి న్యాయం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, కోశాధికారి ఇందిర, జి.వెంకటరమణ ఆధ్వర్యాన బెలగాంలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. అనంతరం పిఒ సుగుణ కుమారికి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో చినబొండపల్లి, బాలగొడబ, గోపాలపురం అంగన్వాడీ కేంద్రాలలో సహాయకులుగా పనిచేస్తున్న వారికి కార్యకర్తలుగా ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉందన్నారు. తొలుత ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, అనంతరం రాజకీయ కారణాల వల్ల వాటిని వెనక్కి తీసుకుని, అనర్హులకు కేటాయించారని తెలిపారు. ఏ సెంటర్లో ఉన్న వారిని ఆ సెంటర్లో నియమించకుండా వేరే చోట్ల ఉద్యోగోన్నతులు కల్పించారని చెప్పారు. విధి విధానాలు పాటించకుండా జరిగిన ఈ ప్రమోషన్లలో భారీగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి.వెంకటరమణ, అధ్యక్ష, కార్యదర్శులు ధర్మవతి, గౌరి, రాజేశ్వరి, జ్యోతి, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు

దండం పెడుతూ నిరసన తెలుపుతున్న పెన్షనర్లు, సంఘం నాయకులు

మోడీ.. మీకు దండం పెడతాం...

ఇపిఎఫ్ పెన్షన్ పెంచండి

ఇపిఎఫ్ పింఛనుదారులు వినూత్న నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

'మోడీ.. మీకు దండం పెడతాం. ఇపిఎఫ్ పెన్షన్ పెంచండి' అటూ పెన్షన్ దారులు వినూత్న నిరసన తెలిపారు. పెన్షనర్స్ డే సందర్భంగా శనివారం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇపిఎఫ్ పెన్షన్ పెంచాలని కోరుతూ మోడీకు దండం పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌పిఎ జిల్లా కార్యదర్శి పి.శంకరరావు, మండల నాయకులు భుజంగరావు మాట్లాడుతూ దేశంలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ ఇపిఎఫ్ పెన్షన్ పెంచకపోవడం అన్యాయమన్నారు. పెన్షన్ ఉద్యోగులకు ఇస్తున్న భిక్షం కాదని, హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పెన్షన్ పెంచకపోవడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలతో అరకొర పెన్షన్‌తో ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బలరాంనాయుడు, టి.రామకష్ణ, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బలరాం నాయుడు, తాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యపై ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి

- ఉపాధి కల్పనా కోర్సులకు అధిక ప్రాధాన్యత : విద్యాశాఖామంత్రి బొత్స
- జెఎన్‌టియులో నూతన భవనాలకు శంకుస్థాపన

శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యకోసం ప్రభుత్వం చేసే ఖర్చు, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అందువల్లే విద్యకోసం ఎన్ని వందల కోట్లు ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. స్థానిక జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో రూ.11కోట్లతో నిర్మించనున్న పరీక్షా కేంద్రానికి, రూ.8కోట్లతో నిర్మించనున్న సమావేశ మందిరానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు సంబధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బొత్స మాట్లాడుతూ, విద్య, వైద్యం, వ్యవసాయానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇప్పటికే వేలాది కోట్ల రూపాయలను విద్యకోసం వెచ్చించారని, ఇది మానవ వనరులకోసం పెట్టిన పెట్టుబడి అని చెప్పారు. ప్రాథమిక విద్యతోపాటు, ఉన్నత విద్యకు కూడా సమాన ప్రాధాన్యత కల్పించామన్నారు. చదువు పూర్తి కాగానే ఉపాధి కల్పించే కోర్సులకు, నైపుణ్య శిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నైపుణ్యం గల మానవ వనరుల కోసం ఎన్నో దేశాలు మన రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. సుమారు 30వేల మంది నర్సులు కావాలని, జర్మనీకి చెందిన ఒక సంస్థ ఇటీవలే రాష్ట్రానికి వచ్చిందన్నారు. దాదాపు 89వేల మందికి మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇచ్చి, సాఫ్ట్ వేర్ నిపుణులుగా తీర్చిదిద్దామన్నారు. 26వేల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు సింగపూర్‌కు చెందిన కంపెనీతో ఒప్పందం జరిగిందని చెప్పారు.

జెఎన్‌టియును అభివృద్ధి చేయడం ఒక బాధ్యతగా భావించి, తన కర్తవ్యాన్ని నిర్వహించానని చెప్పారు. కురుపాంలో రూ.150 కోట్లతో నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. దీనిలో గిరిజనులకు కొంత కోటా కేటాయించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యకు, కళలకు ఎంతో పేరుపొందిన విజయనగరంలో ఏర్పాటు చేసిన జెఎన్‌టియు విశ్వవిద్యాలయం కూడా, దేశంలోనే గొప్ప విద్యాసంస్థగా గుర్తింపు పొందుతుందని అన్నారు. జెఎన్‌టియులో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు టైమ్ స్కేల్‌ను వర్తింపజేయాలని మంత్రిని కోరారు. జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ జివిఆర్ ప్రసాదరాజు, ఛీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసులు, రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ గురునాధ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి డాక్టర్ పి.సూర్యనారాయణరాజు, రాజాం ఎంఎల్‌ఎ కంబాల జోగులు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, జెఎన్‌టియుజివి డైరెక్టర్ జయసింహ, ప్రిన్సిపాల్ శ్రీకుమార్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పరీక్షకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-సాలూరు



ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న రజనీకాంత్, తదితరులు

స్థానిక రామానుజన్ మేథ్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. 26 ఉన్నత పాఠశాలల నుంచి 1481 మంది పదోతరగతి విద్యార్థులు హాజరయ్యారు. గత 22 ఏళ్లుగా గణిత ప్రతిభా పరీక్షని మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రంభ రజనీకాంత్ నిర్వహిస్తున్నారు. ఏటా శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ప్రతిభా పరీక్షలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. శనివారం నిర్వహించిన ప్రతిభా పరీక్ష ప్రశ్నపత్రాలను రజనీకాంత్ ఆవిష్కరించారు. పట్టణ పరిధిలో 13, రూరల్ పరిధిలో 11 ఉన్నత పాఠశాలల్లో ఎక్కడ విద్యార్థులకు అక్కడే పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు చెప్పారు. విద్యార్థుల్లో గణిత శాస్త్రం పట్ల భయం లేకుండా చేసి ఆసక్తి పెంచడానికే ఈ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.ప్రసాదరావు, అధ్యాపకులు సంతోష్, బి.రాజేష్, కె.ఉమ పాల్గొన్నారు.

19న రైస్‌మిల్ కళాసీల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్

చర్చలకు హాజరైన సిఐటియు, కళాసీల సంఘం నాయకులు

ఈ నెల 19న కలెక్టరేట్ వద్ద రైస్‌మిల్ కళాసీలు ధర్నా చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి జి.వెంకటరమణ వెల్లడించారు. పార్వతీపురం ప్రాంతం రైస్ మిల్ కళాసీలకు నూతన పీసు రేట్లు ఒప్పందం చేయాలని శనివారం సివిల్ సప్లై డిఎం సమక్షంలో మిల్లుల యజమానులతో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో కళాసీల తరుపున సిఐటియు నాయకులు, యజమానుల తరుపున మిల్లర్ల సంఘం అధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు. యజమానులు మొండివైఖరి ప్రదర్శించడంతో వాయిదా పడ్డాయి. అనంతరం సిఐటియు నాయకులు మాట్లాడుతూ యజమానులు, కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఆరు నెలలు పాటు కాలక్షేపం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో సమస్య పరిష్కారం చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కళాసీల కూలీరేట్లు వంద శాతం పెంచాలని, రెండేళ్ల ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. మిల్లుల యజమానులు, ప్రభుత్వ అధికారులు స్పందించి ఒప్పందం చేయకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లుల కళాసీల సంఘం నాయకులు పి.లక్ష్మణరావు, గోపాలం, బంటు ఆదినారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



స్కానింగ్ యంత్రాలను తనిఖీ చేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

పట్టణంలోని స్కానింగ్ కేంద్రాల్లో డిఐఒ టి.జగన్మోహన రావు, డెమో సన్యాసిరావు శనివారం తనిఖీలు చేపట్టారు. శ్రీసాయిరాం డయాగ్నొస్టిక్ కేంద్రం, శ్రీసాయి గంగ ఆస్పత్రిలో రికార్డులను, స్కానింగ్ యంత్రాలను పరిశీలించారు. ఆస్పత్రిలో లింగ నిర్ధారణ నేరమని సూచించే పోస్టర్లను పరిశీలించి వీటిని కచ్చితంగా ప్రదర్శించాలని సూచించారు. ప్రతినెలా స్కానింగ్ చేసిన జాబితాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి విధిగా పంపాలని ఆదేశించారు. స్కానింగ్ చేసిన ప్రతివారి నివేదికను ఆన్‌లైన్ చేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాలలో యంత్రాలు, ఉద్యోగులను మార్చాల్సి వస్తే నెల రోజుల ముందుగా డిఎంహెచ్‌ఒ అనుమతి తీసుకోవాలని సూచించారు.

త్వరలో భారత్‌కు పూర్వ వైభవం

సెంచూరియన్ స్నాతకోత్సవంలో గవర్నర్ బిశ్వభూషణ హరిచందన్

ప్రజాశక్తి-నెల్లిమర్ల



మాట్లాడుతున్న చాన్సలర్ దేబి ప్రసన్న పట్నాయక్

ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ హరిచందన్ ఆశాభావం వ్యక్తం చేశారు. మరో ఐదేళ్లలో భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడం ద్వారా భారత్ పూర్వ వైభవం సంతరించుకోనుందన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా వర్చ్యువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న ఐదేళ్లలో మన ఆర్థిక వ్యవస్థ 5 ట్రలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి ఆర్థిక వ్యవస్థలో పాలుపంచుకోవడానికి నైపుణ్యం కలిగిన విద్యార్థులు అవసరమన్నారు. దేశంలోనే నైపుణ్య విద్యను అందించడంలో సెంచూరియన్ మొదటి స్థానంలో ఉందని, రానున్న కాలంలో నూతన విద్యా విధానం అందుకు మరెంతగానో తోడ్పడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఛాన్సలర్ డాక్టర్ దేబి ప్రసన్న పట్నాయక్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో అవకతవకలు, సాంకేతికత వినియోగం తక్కువగా ఉండటం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ దుస్థితి నుంచి బయటపడాలన్నారు. 5జి టెక్నాలజీ రాకతో ఈ అసమానతలు తగ్గుముఖం పట్టవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి నైపుణ్య విద్యను విద్యార్థులకు అందించేందుకు తాము కృషి చేస్తున్నామని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు చెప్పారు. వచ్చే ఏడాది ఎంబిఎ కోర్సులు ప్రవేశపెట్టనున్నా మన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిరు పేదలకు వివిధ రంగాలలో ఉచిత శిక్షణ, ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు.

కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి ముదే సేవల నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఉండాలన్నారు. 2030 నాటికి పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయన్నారు. వివిధ విభాగాలలో ప్రతిభ చూసిన పది మంది విద్యార్థులకు పది బంగారు పతకాలను అతిధుల చేతుల మీదుగా అందజేశారు. ప్రోత్సాహక బహుమతి కింద రూ.10వేలు నగదును అందజేశారు. అనంతరం 149 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యక్షులు డాక్టర్ ముక్తికాంత్ మిశ్రా, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డిఎన్ రావు, ఒడిశా క్యాంపస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, గవర్నింగ్ బాడీ సభ్యులు, అకాడమిక్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్ పద్మరాజు, ప్రొఫెసర్ మల్లికార్జున, పలువురు డీన్లు , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాలతో ముడి.. సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వందేళ్ల తరువాత గ్రామ కంఠాలు, భూముల సర్వే జరుగుతోంది. ఈ కార్యక్రమానికి జగనన్న సమగ్ర భూ సర్వే అనే పేరుపెట్టారు. తద్వారా హక్కుదారులకు మరింత భద్రత చేకూరుస్తామన్నది ప్రభుత్వం చెబుతున్నమాట. ఇందుకోసం అధికారులు, సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో గ్రామ కంఠాల సర్వే పూర్తయింది. ఎప్పుడో ఏర్పడిన గ్రామాలు విస్తరించిన నేపథ్యంలో తాజా సర్వే ద్వారా ప్రస్తుతం స్వరూపాలు మారుతాయి. ఆయా గ్రామాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను గుర్తింపు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రెండో దఫా సర్వే ప్రారంభమైంది. డ్రోన్లు సాయంతో ముందుకు మ్యాపింగ్ చేసి, పంటపొలాలు, గట్లు, పుట్టలు, అందులో ప్రభుత్వ భూములు, ఫారెస్టులను గుర్తిస్తామని చెబుతున్నారు. ఇందుకోసం రెండో దఫా శిక్షణ కార్యక్రమం కూడా దశలవారీగా కొనసాగుతోంది. ఈసర్వే ప్రజల జీవితాలతో ముడిపడి ఉందని, సర్వే సిబ్బంది ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా, నిర్లక్ష్యం వహంచినా, అధికారులు లేదా సిబ్బంది ప్రలోభాలకు గురైనా తాత తండ్రుల నాటి భూములు భూబకాసురులు, కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లేందుకు అవకాశం ఉందని భూ వ్యవహారాలపై కాస్త అవగాహన్న వారంతా చర్చిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. భూముల వివరాలు ఆన్‌లైన్ చేసే పేరుతో గత ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ పథకాన్ని రూపొందించింది. కేవలం కొన్ని నెలలు సమయం ఇచ్చి, ఆలోగా పని పూర్తి కావాలని రెవెన్యూ అధికారులు, సిబ్బంది మెడపై కత్తిపెట్టారు. దీంతో, తీవ్ర ఒత్తిడితో



పనిచేయడం వల్ల ఆన్‌లైన్ నమోదు అంతా తప్పుల తడకగా మారింది. అన్న భూమి తమ్ముడికి, తమ్ముడి భూమి అన్నకి, లేదా పక్కపక్కనేవున్నా ఇతర భూ హక్కుదారులకు దఖలయ్యాయి. వీటిని సరిచేసుకోవడానికి ఇప్పటికీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా క్రయ విక్రయాల్లో ఈ డొల్లతనం బయటపడుతోంది. పూర్వపు భూ రికార్డులు అందుబాటులో ఉండడం వల్ల కొంతలో కొంతైనా ఈ సమస్యలు పరిష్కామౌతున్నాయి. రికార్డులు అందుబాటులో ఉన్నప్పటికీ పరిష్కరించుకునే చొరవలేనివారు ఇప్పటికీ తమ భూములు దరిచేరలేని పరిస్థితి. కొన్నిచోట్ల ఒకరి భూములు మరొకరు విక్రయించుకున్న సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చేపడుతున్న రీసర్వేను ఆషామాషీగా చూడడానికి వీలు లేదు. సర్వేలో ఎన్నో నిబంధనలు, ప్రామాణికాలు తీసుకున్నప్పటికీ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురైనా, లేక పారదర్శకంగా వ్యవహరించకపోయినా హక్కుదారుల జీవితాలు అంధకారంలోకి నెట్టబడతాయనడంలో సందేహం లేదు. ఎందుకంటే, ప్రతి గ్రామాల్లోనూ భూ వివాదాలు ఉన్నాయి. అమాయక ప్రజల భూములు లీజుపేరిట, ఆక్రమణ పద్ధతిలోనే భూస్వాములు లేదా రాజకీయ, ఆర్థికబలం ఉన్నవారి చేతుల్లోవున్నాయి. గ్రామ సభల్లోనూ వారిదే పైచేయిగా నిలిచే ప్రమాదం లేకపోలేదు. గతం మాదిరిగా భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కాదు. ఉన్న స్థితిని యథాతథంగా రికార్డుల్లోకి ఎక్కిస్తామని చెబుతున్నారు. ఈనేపథ్యంలో పాదర్శకత, జవాబుదారితనం లోపిస్తే జీవితాలే అతలాకుతలం అయ్యే ప్రమాదం ఉందని జనం చర్చించుకుంటున్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిటిసి గౌరినాయుడు

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని అంతర్ గ్రామాల రహదారులకు మోక్షం కలగనుంది. దబ్బగడ్డ, డి.శిర్లాం గ్రామాల మధ్య బిటి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 3.54 కోట్లతో ఈ రహదారి పనులను చేపడుతున్నారు. రెండు గ్రామాల మధ్య రహదారి పనులు పూర్తయితే మండల కేంద్రం మక్కువ నుండి పార్వతీపురానికి రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉండబోతుంది. తక్కువ దూరంలో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. రహదారి పనులను డి.శిర్లాం ఎంపిటిసి మాజీ సభ్యులు కోటేశ్వరరావు, ప్రస్తుత ఎంపిటిసి సభ్యులు గౌరినాయుడు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఏళ్ల తరబడి రహదారి లేక ఇబ్బందులు పడుతున్న డి.శిర్లాం పంచాయతీ వాసులకు జెడ్‌పిటిసి సభ్యులు శ్రీనివాసరావు, వైసిపి మండల నాయకులు రంగునాయుడు రోడ్డు మంజూరు చేసి ఇబ్బందులు తొలగించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టు రైతులకు ప్రోత్సాహకాలు ఏవి?

ప్రజాశక్తి-సీతంపేట

మల్బరీ సాగుకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహకాలు అందక తగ్గుముఖం పట్టిందని టిడిపి నాయకురాలు పడాల భూదేవి అన్నారు. శనివారం మండలంలోని దేవనాపురం పంచాయతీ పరిధిలోని మొగధారగూడలో పట్టు పురుగుల కేంద్రాన్ని సందర్శించారు. వాతావరణం అనుకూలించక పోవడంతో పురుగుల ఎదుగుదల తగ్గిందని రైతు, మాజీ ఎంపిపి ఆరిక లచ్చుమయ్య తెలిపారు. దీనిపై భూదేవి స్పందిస్తూ సీతంపేట మండల పరిధిలో అనేక చోట్ల మల్బరీ సాగుతో గిరిజనులు ప్రయోజనాలు పొందేవారని తెలిపారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. గిరిజన రైతులకు సరైన శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలన్నారు. రైతులకు సరైన ప్రోత్సాహకాలు అందించాలని డిమాండ్ చేశారు.

కొండబారిడిలో ఇదేం కర్మ పోస్టర్లను విడుదల చేస్తున్న లావణ్య, తదితరులు

వైసిపి పాలనలో ప్రజలకు ఇదేం కర్మ?

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి పాలనలో ప్రజలకు ఇదేం కర్మని టిడిపి సీనియర్ నాయకులు పువ్వల లావణ్య ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం మండలంలో కొండబారిడి, నీలకంఠాపురం గ్రామాల్లో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాలు, ప్రభుత్వ వైఫల్యాలు గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్లు గడుస్తున్నా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజలపై ధరాభారాన్ని మోపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంజువాణి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - కురుపాం



చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ గంటా శ్రీనివాసరావు

గరుగుబిల్లి మండలం తోటపల్లిలోని వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు తోటపల్లిలోని గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ గంటా శ్రీనివాసరావు శనివారం రూ.లక్ష విరాళం అందించారు. కమిటీ సభ్యులు డి.పారినాయుడికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నగార కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో చిన్నగార కాలనీలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ పార్వతి, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, టెక్నీషియన్ దినేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, ఆదర్శ పాఠశాల సిబ్బంది

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -భామిని

నేషనల్ ఎనర్జీ కంజర్వేషన్ డే సందర్భంగా ఆదర్శ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ జి.బాబురావు, సైన్స్ ఉపాధ్యాయులు దిలీప్ ఆధ్వర్యంలో ఎనర్జీ క్లబ్ విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. శక్తినిచ్చే వనరులును పొదుపుగా వాడి, భవిష్యత్తు తరాల వారికి అందించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్ కుమార్, జానకిరావు, రాము నాయుడు, శ్రీనివాస్, పిఇటి శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

దబ్బగడ్డలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని దబ్బగడ్డ పంచాయతీలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ ఎస్.లక్ష్మి, ఉప సర్పంచ్ సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో పనులు చేయించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి కామేశ్వరి పాల్గొన్నారు

నీతి కథల బోధన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం చిల్డ్రన్స్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు విద్యార్థులకు నీతి కథలు బోధించారు. విద్యార్థులు నీతి కథ చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆయనతోపాటు సహాయకులు ఈశ్వర్ ఉన్నారు.

19న సీజ్ చేసిన వాహనాలకు వేలం

ప్రజాశక్తి-మక్కువ

సారా, మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 19న వేలం వేయనున్నట్లు ఎస్ఇబి సిఐ బి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా సాలూరు ఎస్ఇబి కార్యాలయానికి వచ్చి వేలంలో పాల్గొవాలని కోరారు.

ఉద్యోగానికే విరమణ.. సేవకు కాదు

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఉద్యోగాలకే విరమణ తప్ప సమాజ శ్రేయస్సు కోరే సేవా కార్యక్రమాల నుంచి విరమణ అనేది ఎప్పటికీ ఉండదని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ పింఛనుదారుల భవనంలో శనివారం పెన్షనర్స్‌డేను నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం మొదటి అంతస్తులో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛనుదారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పింఛనుదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పింఛనుదారులు సమైక్యంగా ఉండి హక్కుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని సర్పంచ్ గౌరీశంకర్రావు, విశ్రాంత వైద్యులు గుడివాడ ప్రభాకర్ రావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవం కార్యక్రమంలో వారు మాట్లాడారు. పింఛనుదారులకు తమ వంతు సహకారం అన్నివేళలా ఉంటుందన్నారు. అనంతరం మండల ఉపాధ్యక్షులు నిమ్మక శేఖర్ మాట్లాడుతూ తన తల్లి పెన్షనరేని, పెన్షనర్ల సమస్యలు తనకు తెలుసునని చెప్పారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు జెఎన్ రథో మాస్టారు, బగ్గం బాబ్జిప్రసాద్, బొరిగి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం

వ్యవసాయాధికారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వ్యవసాయాధికారుల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ కమలాకర్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి డి.ప్రవీణ్, కోశాధికారి మురళి , రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ ప్రసాద్, జోనల్ ఉపాధ్యక్షులు రాజగోపాల్ , జోనల్ సెక్రటరీ హరికృష్ణ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా రత్నమాల (పాలకొండ ఎడి), కార్యదర్శిగా ఎస్.అవినాష్ (సీతానగరం ఎఒ), కోశాధికారిగా శ్రావణ్ కుమార్ నాయుడు (బలిజిపేట ఎఒ), ఉపాధ్యక్షులుగా పి.శంకర్రావు (కొమరాడ ఎఒ), సహాయ కార్యదర్శిగా షణ్ముఖరాజు (గుమ్మలక్ష్మీపురం ఎఒ) ఎన్నికయ్యారు.

కార్యక్రమంలో వ్యవసాయ అధికారుల సంఘం విజయనగరం నాయకులు ప్రకాష్, మజ్జిశ్యాంసుందర్, వై.సురేష్, వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా సచివాలయ సేవలు

ప్రజాశక్తి-సీతానగరం

సచివాలయ సేవలు ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలని డ్వామా పీడీ డి.రామచంద్రరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సచివాలయంలోనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి, ఎపిఒ జి.నాగలక్ష్మి, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

బలిజిపేట : మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీలో శనివారం సువర్ణముఖి నది నుంచి శ్మశానవాటికకు చేపడుతున్న రోడ్డు పనులను డ్వామా పీడీ కె.రామచంద్రరావు శనివారం పరిశీలించారు. కొలతల ప్రకారం పని నమోదు చేయాలని, మిగతా వారిని కూడా పనిలోకి తీసుకురావాలని ఉపాధి సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కె.కేశవరావు, ఇసి శ్రీనివాసరావు, సిబ్బంది బి.ఏసెబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బలిజిపేట.. ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

రాష్ట్ర మహాసభ విజయవంతానికి మున్సిపల్ కార్మికుల ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం ఆధ్వర్యాన శనివారం పట్టణంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21, 22వ తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చామని తెలిపారు. కానీ, నేటికీ తమ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. దీనిపై రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తు నిర్ణయాలు చేస్తామన్నారు. కార్మికులు బంగారు రవి, మామిడి శివ, రాజేష్, సత్తిరాజు, లక్ష్మి, పుణ్యవతి, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు'తో ప్రయోజనం లేదు

ప్రజాశక్తి-కొమరాడ

ప్రభుత్వం చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రయోజనం లేదని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. ఆ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకు వస్తున్నామని చెబుతున్నా.. ఎక్కడా ఆ పరిస్థితి లేదన్నారు. సమస్యలను చెప్పనివ్వకుండా అడ్డుకునే పరిస్థితి కనిపిస్తుందన్నారు. సమస్యలు చెప్పుకోవడానికి ముందుకు వస్తే స్థానిక నాయకులు, పోలీస్ సిబ్బంది 'ఇప్పుడేం అడుగుతావు' అంటూ వారిని పక్కకు నెట్టేస్తున్నారని చెప్పారు. ఇలా అయితే మరి గడపగడపకు ఎందుకు వెళ్తున్నారని నిలదీశారు.

అనంతబాబుకు బెయిల్ ఇవ్వడం అన్యాయం

ప్రజాశక్తి-కొమరాడ

దళితుడిని హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ ఇవ్వడం దారుణమని ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బిడ్డక తమ్మయ్య పేర్కొన్నారు. కొమరాడలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతబాబును వైసిపి నాయకులు ఊరేగింపుగా తీసుకెళ్లడం అన్యాయమన్నారు. దళితుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మరడాన వెంకటనాయుడు, శిష్టు క్రిష్ణమూర్తి నాయుడు, రాజాను రాము పాల్గొన్నారు.

మహిళా మార్టు ఏర్పాటుకు చొరవ చూపాలి

డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-వీరఘట్టం

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలో మహిళా మార్టు ఏర్పాటుకు విఒఎలు చొరవ చూపాలని డిఆర్‌డిఎ కిరణ్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో విఒఎలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కొక్క సభ్యురాలి నుంచి రూ.200 వసూలు చేస్తే రూ.36 లక్షలు అవుతుందని తెలిపారు. వాటి ద్వారా నిత్యావసర వస్తువుల విక్రయాలు చేపడితే లక్షాధికారులు అవుతారని చెప్పారు. వీటిపై అవగాహన పెంపొందించుకొని మహిళా మార్టులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటిపై గ్రామాల్లో ఎస్‌హెచ్‌జి మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. శ్రమకు తగ్గ ఫలితం కూడా ఉంటుందని, ఈ అవకాశాన్ని స్వదనియోగం చేసుకోవాలని విఒఎలకు సూచించారు. సమావేశంలో ఎపిఎం జి.శివున్నాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు పి.సుజాత, పార్వతీపురం ఎపిఎం రాణి రత్నకుమారి, రైతు ఉత్పదారుల సంఘం సిసి ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయడాన్ని ఎంపిపి శెట్టి పద్మావతి ప్రశంసించారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద పెన్షనర్ల సంఘ అధ్యక్షులు టి.పాండురంగరావు ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయాలని, ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తానని హామీనిచ్చారు. ఈ శిబిరంలో 12 మంది పెన్షనర్లు, 15 మంది ఇతర వృద్ధులు నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌టిఒ కె.శంకరరావు, జెడ్‌పిటిసి జి.సుజాత, సర్పంచ్ జి.సుజాత, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి శెట్టి పద్మావతి

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాద్యాయులకు సాల్ట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు శనివారం శిక్షణను డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు పరిశీలించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతానగరం మండలాలకు చెందిన ఉపాద్యాయులకు ఇక్కడ సాల్ట్ శిక్షణ నిర్వహిస్తున్నారు. కోర్స్ డైరెక్టర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులను డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు.

ఆటో డ్రైవర్లకు, యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో శనివారం ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతిఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్లు ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు ఆటోలో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించరాదని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తిరుపతిరావు, రామకృష్ణ, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేట గ్రామంలో శనివారం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో నో యాక్సిడెంట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సింహాచలం అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు ఆపి డ్రైవర్లకు, ప్రయాణికులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తాగి వాహనాలు నడపడం, అధిక లోడ్ ప్రయాణం చేయడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వంటివి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు జయరాం, సత్యనారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పంట సేకరణ కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని తోణాం పంచాయతీ ముంగివాని వలస గ్రామంలో శనివారం పంట సేకరణ కేంద్రానికి సర్పంచ్ మువ్వల అదయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ధరణి ఎఫ్ఇఒ ద్వారా మార్కెటింగ్ చేయడానికి ఈ కేంద్ర ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ధరణి సభ్యులు భీమారావు, శ్రీనివాస్, దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ సిఇఒ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దంటూ 19న ర్యాలీ

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలోని బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులస్తులను ఎస్‌టి జాబితాలో కలపొద్దని కోరుతూ సోమవారం పార్వతీపురంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జె.పైడిరాజు, కార్యదర్శి టి.సత్యనారాయణ తెలిపారు. పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. ఈ ర్యాలీలో అన్ని గిరిజన సంఘాలతో పాటు ఆదివాసీ ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని గిరిజన ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

సృజనాత్మకత కోసమే నో బ్యాగ్ డే

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు నో బ్యాగ్ డే కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని చింతలగూడ వీధి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మేనేజర్ బేత కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. నో బ్యాగ్ డే సందర్భంగా శనివారం విద్యార్థులతో వివిధ కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆకులతో వివిధ రకాల పక్షులు, జంతువుల బొమ్మలను, తదితర కృత్యాలను చేయించారు. దేశభక్తి గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేత కుమారస్వామి, వాలంటీర్లు ఎస్.సునీత, పి.ప్రశాంతి పాల్గొన్నారు.

వేసిన బొమ్మలను చూపిస్తున్న విద్యార్థులు

అంగన్వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని గవరమ్మపేట గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి శనివారం ఎంఎస్‌ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీశంకర్‌రావు, సర్పంచ్ కొల్లి సత్యంనాయుడు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం చేపడుతున్న నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి అంగన్వాడీ భవనం మంజూరైంది. కార్యక్రమంలో ఎంపిటిసి మద్రాపు లక్ష్మునాయుడు, రెడ్డి రవికుమార్, అంగన్వాడీ కార్యకర్త భారతి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, తదితరులు

సొంతూరిని మరువలేం

హైకోర్టు జడ్జి చీమలపాటి రవి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

సొంత ఊరును ఎప్పుడూ మరువలేమని, తమ మీద గ్రామ ప్రజలు చూపిస్తున్న ఆధారాభిమానాలు జీవితాంతం గుర్తుండిపోతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి చీమలపాటి రవి అన్నారు. సొంత ఊరిలో తన తల్లిదండ్రులు చీమలపాటి శ్రీరామమూర్తి, సూర్యకాంతం దంపతుల 60వ వివాహ వార్శికొత్సవం జరగటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మండలంలోని భైరిపురంలో శనివారం ఆయన తల్లిదండ్రుల వివాహ వార్సికోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామం అంటే తనకు తన తండ్రికీ ఎంతో ఇష్టమన్నారు. అందుకనే ఎంత కష్టమైనా ఇక్కడ వివాహ వార్శికొత్సవం జరుపుకోవటం అతను ఇష్టపడతారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీరామమూర్తి, సూర్యకాంతం దంపతుల కుమారులు చీమల పాటి శేఖర్, కుమార్తె మండా విజయెశ్వరి, గ్రామ సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు, వైస్ ఎంపిపి కందుల పార్వతి, జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షులు కందుల మళ్ళి ఖార్జునరావు, సింగారపు రామకృష్ణ, జెడ్పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, మాజీ సర్పంచ్ కెంగువ ధనంజయ, యూత్ సభ్యులు, జిల్లా జడ్జి సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా సబ్ జడ్జి శ్రీనివాస్, చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి విజయ రామేశ్వరి, మండల తహశీల్దార్ బి. రత్న కుమార్, చీపురుపల్లి సిఐ జి. సంజీవరావు, ఎస్ఐ సన్యాసినాయుడు, గరివిడి ఎసిఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల వివాహ వార్సికోత్సవంలో పాల్గొన్న జడ్జి రవి, తదితరులు

1200 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-పాచిపెంట

స్కూటీపై తరలిస్తున్న 1200 సారా ప్యాకెట్లను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పాచిపెంట మండలం యారడ్లవలస గ్రామ సమీపంలో ఇద్దరు వ్యక్తులు సారా ప్యాకెట్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సారా తరలిస్తున్న పాచిపెంట ఎస్‌సి కాలనీకి చెందిన పోతల సింహాచలం, కుచ్చుల ఇంద్రకుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

సారా ప్యాకెట్లతో తాళ్లడుమ్మ గ్రామానికి చెందిన కె.సుబ్రహ్మణ్యం పట్టుపడినట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి ఆయన వద్ద నుండి 1200 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేశామని తెలిపారు.